తెలుగు దినపత్రిక
ప్రభాత
jayabheridaily.com
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 01
సంచిక : 47
పేజీలు : 4
వెల : 4
మల్కాజిగిరి
సోమవారం, 28-08-2023

జయభేరి దినపత్రిక, జయభేరి ఛానల్‌లో
నిఖార్సైన జర్నలిస్టులుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు.. కథనాలు...
ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలనుకుంటున్నారా?
మీ కలాలకు పదును పెట్టండి....
విలేకర్లు కావలెను
ఆసక్తి కలిగిన యువతి యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత
email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com
9391 544 889 call me



## వచ్చే ఎన్నికల్లో
# కేసీఆర్ ఇంటికే

**జయభేరి, హైదరాబాద్ :**
ఖమ్మంలో "రైతు గోస బీజేపీ భరోసా" బహిరంగ సభలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పాల్గొన్నారు. ఈ సభలో అమిత్ షా మాట్లాడుతూ బీఆ రఎస్ అధినేత కేసీఆర్‌పై విమర్శలు చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ కుటుంబ పార్టీలని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలన్నారు. కాంగ్రెస్ పార్టీ సోనియా కుటుంబం కోసం పనిచేస్తుంటే బీఆర్ఎస్ కల్వకుంట్ల కుటుంబం కోసం పనిచేస్తోందని అమిత్ షా విమర్శలు చేశారు. తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన వారి కలలను సీఎం కేసీఆర్ కల్లలు చేశారని అమిత్ షా ఆరోపించారు. కేసీఆర్ పాలనకు నూకలు చెల్లాయన్నారు. భద్రాచలం స్వామి వారికి బీజేపీ సీఎం పట్టువ స్త్రాలు సమర్పిస్తారన్నారు. ఈసారి కేసీఆర్, కేటీఆర్ సీఎం కారని జోస్యం చెప్పారు. తెలంగాణలో కమలం వికసిస్తుందని కేంద్ర మంత్రి అమిత్ షా తెలిపారు. బీఆర్ఎస్ కు తామే ప్రత్యామ్నాయం అన్నారు. కేసీఆర్, ఒవైసీతో బీజేపీ కలిసే ప్రసక్తే లేదన్నారు. రైతు, దళిత, మహిళా వ్యతిరేక కేసీఆర్ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలన్నారు. శ్రీరామనవమికి భద్రాచలంలో పాలకులు వస్త్రాలు సమర్పించే సంప్రదాయాన్ని కేసీఆర్ విస్మరించారని ఆరోపించారు. కేసీఆర్ కారు భద్రాచలం వెళ్తుంది కానీ ఆలయం వరకు వెళ్ల దన్నారు. కేసీఆర్ కారు స్టీరింగ్ ఎంఐఎం నేత ఒవైసీ చేతుల్లో ఉందని అమిత్ షా ఆరోపించారు. కేసీఆర్ కారు ఇకపై భద్రాచలం వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. త్వరలోనే బీజేపీ సీఎం భద్రాచలంలో స్వామికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారన్నారు. అంతకు ముందు ఢిల్లీ నుంచి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా... కృష్ణాజిల్లా గన్నవరం ఎయిర్ పోర్టుకు చేరుకున్నారు. గన్నవ రం ఎయిర్ పోర్టులో ఏపీ హోంమంత్రి తానేటి వనిత కేంద్ర మంత్రి అమిత్ షా కు ఘన స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి ప్రత్యేక హెలికా ప్టర్ లో అమిత్ షా ఖమ్మం సభకు చేరుకున్నారు. ఖమ్మంలో బీజేపీ... రైతు గోస బీజేపీ భరోసా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ బహిరంగ సభలో అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బీఆర్ఎస్ మిగతా 2 లో

## జగన్ కేసులకు భయపడి బీజేపీకి దాసోహం




**జయభేరి, హైదరాబాద్ :**
సీఎం జగన్ కేసులకు భయపడి ప్రధాని మోదీకి లొంగిపోయారని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శించారు. సీపీఐ చేపట్టిన బస్సు యాత్ర గుంటూరు చేరుకుంది. గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించిన సభలో సీపీఐ నారాయణ మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లో వైసీపీ, బీఆర్ఎస్ ముసుగులో బీజేపీ పాలనే సాగుతోందని ఆరోపించారు. ఎన్నికల్లో గెలిపిస్తే కేంద్రం మెడలు వంచుతానని చెప్పిన సీఎం జగన్ కేసులకు భయపడి ప్రధాని మోదీకి లొంగిపోయారని నారాయణ విమర్శించారు. ఎన్నో కేసుల్లో నిందితుడిగా ఉన్న జగన్ చాలా ఏళ్లుగా బెయిల్‌పై బయట ఉన్నారన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏ నిందితుడూ ఇన్నాళ్లు బెయిల్‌పై బయట ఉండలేదన్నారు. గుంటూరులో సీపీఐ నిర్వహించిన కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సీనియర్ నేత ముప్పాళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. దేశాన్ని మోదీ, రాష్ట్రాన్ని జగన్ నుంచి కాపాడాలని సీపీఐ ప్రయత్నం చేస్తుందని నారాయణ అన్నారు. మణిపూర్ అల్లర్లలను అడ్డుపెట్టుకుని మతం ముసుగులో బీజేపీ అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తున్నారు. క్రిమినల్ మిగతా 2 లో

### పెళ్లి కాని యువకుడ్ని ట్రాప్ చేసి
## లక్షల్లో మోసం
### భర్త, కూతుళ్ల సాయంతో మహిళ మాస్టర్ ప్లాన్



**జయభేరి, నిజామాబాద్ :**
మ్యాట్రిమోనీ సైట్ లో పెళ్లి కాని యువకుడ్ని ట్రాప్ చేసి డబ్బులు గుంజుకుంది ఓ మహిళ. తీరా పెళ్లి ప్రస్తావన తెచ్చేసరికి మాట మార్చింది. అనుమానం వచ్చిన యువకుడు పోలీసులకు ఫిర్యాదు చేస్తే కిలేడీ నిజస్వరూపం బయటపడింది. నిజామాబాద్ జిల్లా బోధన్‌కు చెందిన యువకుడు ఓ ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్నాడు. యువకుడు పెళ్లి సంబంధాల కోసం మ్యాట్రిమోనీ సైట్ లో పేరు నమోదు చేసుకున్నాడు. అందులోంచి యువకుడి ఫోన్ నెంబర్ తీసుకున్న విశాఖ చెందిన స్వాతి అనే మహిళ... యువకుడికి ఫోన్ చేసి తనను వధువుగా పరిచయం చేసుకుంది. పెళ్లి ఆలోచన ఉందని యువకుడి వివరాలు తెలుసుకుంది. యువకుడితో పరిచయం పెంచుకుని నిత్యం గంటల తరబడి ఫోన్ లో మిగతా 2 లో

## గర్భవతిని కిరాతకంగా చంపిన తల్లిదండ్రులు



**జయభేరి, ఉత్తర్ ప్రదేశ్ :**
ఉత్తర్ ప్రదేశ్లో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. గర్భవతి అయిన యువతిని, ఆమె తల్లిదండ్రులు కిరాతకంగా చంపేశారు. ప్రియుడికి వ్యతిరేకంగా కోర్టులో సాక్ష్యం చెప్పేందుకు ఆమె నిరాకరించడమే ఇందుకు కారణమని తెలుస్తోంది! ఉత్తర్ ప్రదేశ్ మజాఫర్నగర్కు చెందిన ఓ 19ఏళ్ల యువతి, తన ప్రియుడు రాహుల్తో కలిసి.. 2022 అక్టోబర్లో ఇల్లు విడిచి వెళ్లిపోయింది. యువతి కుటుంబం పోలీసులకు ఫిర్యాదు చేసింది. గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు.. డిసెంబర్లో ఈ ప్రేమ జంటను ట్రేస్ చేశారు. యువతిని, ఆమె కుటుంసభ్యులకు అప్పగించి.. యువకుడిపై కిడ్నాప్, రేప్ కేసులు వేసి జైలుకు తరలించారు. ఈ కేసుపై మిగతా 2 లో

## కాంగ్రెస్ తో పొత్తుకు సీపీఐ సై
### మూడు సీట్లు కేటాయించాలని పట్టు



**జయభేరి, హైదరాబాద్ :**
సీఎం కేసీఆర్ హ్యాండివ్వడంతో వామపక్షాలు కాంగ్రెస్ వైపు చూస్తున్నాయి. తమకు నాలుగు స్థానాలు కేటాయిస్తే పొత్తుకు సిద్ధమని నేతలు ప్రకటిస్తున్నారు. సీపీఐ నేతలు కాంగ్రెస్ వ్యవహారాల ఇన్ ఛార్జ్ మాణిక్ రావు ఠాక్రేతో చర్చలు మొదలుపెట్టారు. మునుగోడు, హుస్నాబాద్, కొత్తగూడెం, బెల్లంపల్లి స్థానాలపై సీపీఐ గురిపెట్టినట్లు తెలుస్తోంది. అయితే కాంగ్రెస్ రెండు సీట్లు ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేస్తుంది. వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పొత్తులకు పావులు కదుపుతోంది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుతో కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ ఠాక్రే చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. తాము పోటీ చేసే స్థానాలను ఆయన కాంగ్రెస్ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు. బెల్లంపల్లి, హుస్నాబాద్, కొత్తగూడెం, మునుగోడు స్థానాలలో మూడు స్థానాలను కేటాయిస్తే కాంగ్రెస్ తో పొత్తుకు సిద్ధమని కూనంనేని సాంబశివరావు అన్నట్లు తెలుస్తోంది. సీపీఎం కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గం సమావేశం ఆదివారం జరిగింది. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు పాల్గొన్నారు. అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా ఈ సమావేశం జరిగినట్లు తెలుస్తోంది. సీట్లు కేటాయించకుండా బీఆర్ఎస్ పార్టీ హ్యాండ్ ఇవ్వడంతో..తదుపరి నిర్ణయంపై సీపీఎం సమాలోచనలు చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో సీపీఐతో కలిసి పోటీ చేయాలని ఇప్పటికే సీపీఎం నిర్ణయించింది. పొత్తులు, సీట్ల సర్దుబాటు సహా ఇతర అంశాలపై సీపీఎం కార్యవర్గ సమావేశంలో నేతలు చర్చించారు. మునుగోడు ఎన్నికల్లో వామపక్ష పార్టీలతో బీఆర్ఎస్ పొత్తు పెట్టుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఈ పొత్తు కొనసాగుతోందని ప్రచారం జరిగింది. అయితే సీఎం కేసీఆర్ అనూహ్యంగా లెఫ్ట్ పార్టీలకు హ్యాండ్ ఇచ్చారు. ఇటీవల మిగతా 2 లో

## సీఎం పదవి కాదు..
### ముందు సింగిల్ డిజిట్ తెచ్చుకోండి



### - అమిత్ షాకు హరీశ్ రావు కౌంటర్

**జయభేరి, హైదరాబాద్ :**
ఖమ్మం సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా బీఆర్ఎస్ ప్రభుత్వంపై చేసిన విమర్శలకు మంత్రి హరీశ్ రావు కౌంటర్ ఇచ్చారు. కుటుంబ పాలనపై అమిత్ షా మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. సరిగ్గా బ్యాట్ పట్టుకోవడం కూడా చేతకాని జై షాకు బీసీసీఐలో కీలక పదవి ఎలా వచ్చిందో చెప్పాలని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో మీరందరు మాజీలవుతారని సెటైర్లు వేశారు. కేసీఆర్ కు నూకలు చెల్లడం కాదు, తెలంగాణ ప్రజలను నూకలు తినాలని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ అన్నప్పుడే బీజేపీ తెలంగాణలో నూకలు చెల్లిపోయాయన్నారు. సీఎం పదవి కాదు ముందు తెలంగాణలో సింగిల్ డిజిట్ తెచ్చుకునేందుకు బీజేపీ ప్రయత్నించాలన్నారు. అవుట్ డేటెడ్ ఆరోపణలతో రాసిచ్చిన స్క్రిప్ట్ తో అమిత్ షా స్కిట్ చేశారంటూ హరీశ్ రావు విమర్శించారు. ఈ మేరకు ఆయన ట్విట్టర్ వేదికగా విమర్శలు చేశారు. "పెద్ద ఎత్తున రైతులు ఉద్యమిస్తే కార్పొరేట్లకు కొమ్ముకాసే చట్టాలను ఉపసంహరించుకుని తోకముడిచిన మీరా.. రైతు బాంధవుడైన కేసీఆర్ ను విమర్శించేది. 2జీ 3జీ 4జీ కాదు, కేంద్రంలో దశాబ్ద కాలంగా నాజీలను మించిన నియంతృత్వ పాలన మీది. రాబోయే ఎన్నికల్లో మీరు మాజీలే. సీఎం పదవి కాదు. ముందు తెలంగాణలో సింగిల్ డిజిట్ తెచ్చుకునేందుకు ప్రయత్నించండి. తెలంగాణ అభివృద్ధి విషయంలో రాజీలేని యోధుడు కేసీఆర్. అబద్ధపు విమర్శలు, అవుట్ డేటెడ్ ఆరోపణలు, రాసిచ్చిన స్క్రిప్ట్ తో హోంమంత్రి స్కిట్ చేశారు" మంత్రి హరీశ్ రావు

**స్ట్రాంగ్ లీడర్ కావాలా? రాంగ్ లీడర్ కావాలా?**
ఎవరెన్ని ట్రిక్స్ చేసినా వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని మంత్రి హరీశ్ రావు అన్నారు. తెలంగాణకు స్ట్రాంగ్ లీడర్ కావాలో? లేక రాంగ్ లీడర్ కావాలో? ప్రజలు ఆలోచించాలన్నారు. గతంలో ఎంబీబీఎస్ చదవాలంటే ఇతర దేశాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు తెలంగాణలో ఉంటూనే వైద్య విద్య చదివే అవకాశం వచ్చిందన్నారు. ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ చొప్పున ఏర్పాటు చేసిన తొలి రాష్ట్రం తెలంగాణ అన్నారు. ప్రజలకు మంచి చేసే పనులు మీడియాలో ఎక్కువగా కనిపించవన్నారు. ఎదుటి వారిని తిడితే వార్తల్లో ఎక్కువ కనిపిస్తామన్నారు. రాష్ట్రానికి పేపర్ లీడర్ కావాలా? ప్రాపర్ లీడర్ కావాలా? అని ప్రజలు ఆలోచించాలన్నారు. తెలంగాణ ఫార్మా హబ్, హెల్త్ హబ్, ఐటీ హబ్‌గా మారిందన్నారు. తెలంగాణ ధాన్యం ఉత్పత్తిలో నంబర్ వన్ ఎదిగిందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో 2014లో 30 శాతం డెలివరీలు అయితే నేడు 72.8 శాతానికి పెరిగాయన్నారు.

jayabheridaily.com
ప్రభాత జయభేరి

▶▶ మొదటిపేజీ తరువాయి

## బీజేపీకి దాసోహం

ఆలోచనలు ఉన్న అమిత్ షా వల్లే మణిపూర్ లాంటి అల్లర్లు జరుగుతున్నాయన్నారు. దేశంలో అల్లర్లకు మతతత్వ ఆందోళనలకు బీజేపీ ఆద్యం పోసిందని సీపీఐ నారాయణ ఆరోపించారు. నిన్నటి వరకూ మోదీని విమర్శించిన తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఇప్పుడు బీజేపీ అనుకూలంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. వివేకా హత్య కేసులో ఎంపీ అవినాష్ రెడ్డిని కాపాడేందుకు సీఎం జగన్ కేంద్రానికి లొంగిపోయారన్నారు. కూతుర్ని ఢిల్లీ లిక్కర్ స్కాం నుంచి బయటపడేసేందుకు కేసీఆర్ బీజేపీ తొత్తుగా మారిపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీకి జగన్ దత్తపుత్రుడుగా కొనసాగుతున్నారని నారాయణ అన్నారు. జగన్ పైకి వైసీపీ ముద్ర, లోపల బీజేపీ ముద్రతో పనిచేస్తున్నారన్నారు. రాష్ట్రంలో వైసీపీ దేశంలో బీజేపీ పాలన పోవాలని సీపీఐ పోరాడుతోందని నారాయణ అన్నారు. ప్రస్తుతానికి పవన్ కల్యాణ్, బీజేపీతో కలిసి ఉన్నారని, ఎన్నికల సమయానికి పవన్ బీజేపీతో ఉంటారా లేదా అన్నది ప్రశ్నార్థకమే అని నారాయణ విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ.. మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య జరిగి నాలుగేళ్లు అవుతున్నా... నేటికీ నిందితులను పట్టుకోలేదని ఆరోపించారు. పులివెందులలో చిన్న పిల్లాలడిన అడిగినా వివేకా హత్య చేసిందెవరో చెబుతారన్నారు. సీబీఐ మాత్రం ఇంకా విచారణ చేయడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు.

## లక్షల్లో మోసం

మాట్లాడేది. దీంతో యువకుడు ఆమెను వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఇలాగో ఆ మహిళ యువకుడు దగ్గర వివిధ కారణాలు చెబుతూ డబ్బులు తీసుకుంది. ఒకసారి రోడ్డు ప్రమాదం జరిగిందని అర్జెంట్‌గా డబ్బు అవసరమని చెప్పింది. ఇలా ఏదోక కారణం చెబుతూ యువకుడి వద్ద దాదాపుగా రూ.4 లక్షల తీసుకుంది. పెళ్లి చేసుకోబోయే యువతే కదా! అని యువకుడు లక్షల్లో డబ్బు ఇచ్చాడు. పెళ్లి చేసుకుందామని యువకుడు అడిగినప్పుడల్లా ఏదొక కారణం చెబుతూ మహిళ తప్పించుకునేది. ఇలా ఒక సంవత్సరం గడిచింది. పెళ్లి చేసుకుందామని యువకుడు ఒత్తిడి చేయడంతో అతడ్ని దూరం పెట్టింది. యువకుడి ఫోన్ నెంబర్ ను బ్లాక్ చేసింది. ఎన్ని సార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానంతో మహిళ గురించి ఆరా తీశాడు. ఆమె అసలు పేరు స్వాతి అని, ఆమెకు ఇప్పటికే పెళ్లి జరిగిందని తెలిసింది. అంతేకాదు ఆమెకు భర్త, ఇద్దరు కూతుళ్లు ఉన్నట్టు తెలిసింది. దీంతో మహిళను నిలదీశాడు యువకుడు. గట్టిగా ప్రశ్నించడంతో యువకుడిపై ఎదురుదాడికి దిగింది మహిళ. మోసపోయానని తెలుసుకున్న యువకుడు బోధన్ పోలీసులను ఆశ్రయించాడు. యువకుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోలీసుల విచారణలో అసలు విషయం తెలిసింది. వివాహిత స్వాతి మాత్రమే యువకుడిని మోసం చేయలేదని, ఈ నాటకం వెనుక ఆమె భర్త, ఇద్దరు కూతుళ్లు కూడా ఉన్నారని దర్యాప్తులో తేలింది. భర్త, కూతుళ్ల సహకారంతో స్వాతి పెళ్లి కాని యువకులను మోసం చేస్తున్నట్లు గుర్తించారు. ఈ మోసంలో మహిళ కుటుంబం మొత్తం భాగస్వాములుగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో వారిపై కూడా కేసు నమోదు చేశారు పోలీసులు.

## కిరాతకంగా చంపిన తల్లిదండ్రులు

కొంతకాలంగా విచారణ జరుగుతోంది. ఈ క్రమంలోనే యువతి గర్భం దాల్చిందని తేలింది. రాహుల్కు శిక్షపడాలని యువతి తల్లిదండ్రులు బలంగా కోరుకున్నారు. ఇందుకోసం కూతురు సాక్ష్యం చెప్పాలని అనేకమార్లు ఒత్తిడి చేశారు. కానీ ఆమె అంగీకరించలేదని తెలుస్తోంది. శనివారం.. స్థానిక కోర్టులో ఈ కేసుకు సంబంధించిన కీలక విచారణ జరగాల్సి ఉంది. సమయానికి యువతి, ఆమె తల్లిదండ్రులు కోర్టుకు వెళ్లలేదు. అనుమానం వచ్చి దర్యాప్తు చేపట్టగా పోలీసులకు అసలు విషయం తెలిసింది. రాహుల్కు వ్యతిరేకంగా స్టేట్మెంట్ ఇవ్వనని కూతురు చెప్పడంతో తల్లిదండ్రులకు తీవ్ర కోపం వచ్చింది. ఇద్దరు కలిసి.. సొంత బిడ్డను గొంతు నులిమి చంపేశారు. ఆమె 8 నెలల గర్భవతి అని కూడా చూడలేదు! అనంతరం యువతి మృతదేహాన్ని గోఝ్లా గ్రామానికి సమీపంలో ప్రవహిస్తున్న నదిలో పడేశారు. పోలీసులకు ఈ విషయం వెంటనే తెలిసిపోయింది. సంబంధిత దంపతులను అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు. నిందితులు వెంటనే నిజాన్ని అంగీకరించారు. "రాహుల్కు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పాలని చాలాసార్లు అడిగాము. ఆమె ఒప్పుకోలేదు. కోపంతో చంపేశాము," అని దంపతులు పోలీసులకు చెప్పినట్టు సమాచారం. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. దర్యాప్తును ముమ్మరం చేశారు.

## వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ ఇంటికే

పాలనలో వ్యవసాయం నిర్వీర్యమైందని కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ చీఫ్ కిషన్ రెడ్డి విమర్శించారు. ఖమ్మం సభలో మాట్లాడిన ఆయన కేసీఆర్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. కేసీఆర్ సర్కార్ వ్యవసాయ సబ్సిడీలు ఇవ్వడం లేదని ఆరోపించారు. వరి వేయొద్దని కేసీఆరే రైతులకు చెబుతున్నారన్నారు. రాష్ట్రంలో 75 శాతం కౌలు రైతులు ఉన్నారన్నారు. వ్యవసాయ రుణాలు పావలా వడ్డీకి ఇవ్వట్లేదన్నారు. రాష్ట్రంలో కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్న కిషన్ రెడ్డి... రుణమాఫీలు నామమాత్రంగా చేస్తున్నారన్నారు. కేసీఆర్ రైతులను వెన్నుపోటు పొడిచారన్నారు. కోటి ఎకరాలకు సాగునీరు ఇస్తామన్న కేసీఆర్ హామీ ఏమైందని కిషన్ రెడ్డి ప్రశ్నించారు.

## కాంగ్రెస్ తో పొత్తుకు సీపీఐ సై

ప్రకటించిన 115 మంది అభ్యర్థుల జాబితాలో సీపీఐ, సీపీఎంకు సీట్లు కేటాయించలేదు. కేసీఆర్ నమ్మకద్రోహం చేశారని వామపక్ష పార్టీల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘ మంతనాలు చేస్తున్న సీపీఎం నేతలు వచ్చే ఎన్నికల్లో పొత్తులు, సీట్ల సర్దుబాటుపై చర్చిస్తున్నారు. లెఫ్ట్ పార్టీలకు బీజేపీతో పొసగదు కాబట్టి వామపక్షాలకు తెలంగాణలో ఉన్న ఏకైక ఆప్షన్ కాంగ్రెస్. వామపక్షాలు, కాంగ్రెస్ పార్టీలు అవసరమైన సమయంలో పొత్తులు పెట్టుకున్నాయి. దీంతో తెలంగాణ కాంగ్రెస్ సీపీఐ, సీపీఎంతో పొత్తులకు ప్రయత్నాలు చేస్తుంది. ఈ నాయకుల మధ్య రహస్యంగా సమావేశాలు జరుగుతున్నాయని తెలుస్తోంది. సీట్ల సర్దుబాటులో చర్చలు కొలిక్కి వస్తే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ , సీపీఎం కలిసి పోటీ చేసే అవకాశం ఉంది.




**సోలిస్ ఐ కేర్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్, చైర్మన్ ఎన్.రాము అన్న జన్మదిన సందర్భంగా వారిని సన్మానించిన ఉప్పల్ నియోజకవర్గ BRS పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామరావు, BRS నాయకుడు మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.**

**- జయభేరి, కాప్రా**

# పోలీస్ వ్యవస్థ మార్గదర్శనంగా ఉండాలి

**న్యూఢిల్లీ :**



పాత క్రిమినల్ చట్టాలను సవరిస్తూ .. కొత్త క్రిమినల్ చట్టాలు పార్లమెంటులో ఆమోదం పొందిన విషయం తెలిసిందే. ఇకపై కొత్త క్రిమినల్ చట్టాలనే అమలు చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో పోలీసు అధికారులతో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా సమావేశం నిర్వహించారు. కొత్త క్రిమినల్ చట్టాల అమలుపై అవగాహన కల్పించడంతోపాటు.. పకడ్బందీగా అమలు చేయాలని పోలీసు అధికారులను హోం మంత్రి ఆదేశించారు. రెండు రోజుల పాటు పోలీసు ఉన్నతాధికారులతో మంత్రి సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం త్వరలోనే అందుబాటులోకి తీసుకురానున్న కొత్త క్రిమినల్ చట్టాలను క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు సిద్ధంగా ఉండాలని కేంద్ర హోం మంత్రి పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ను అవసరాలకు అనుగుణంగా వాడుకోవాలని సూచించారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) బిల్లు, 2023, భారతీయ నగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) బిల్లు 2023, భారతీయ సక్ష (బీఎస్) బిల్లు 2023 వరుసగా భారతీయ శిక్షాస్మృతి, 1860, క్రిమినల్ ప్రొసీజర్ చట్టం, 1898 మరియు ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్, 1872 స్థానంలో మూడు కొత్త కోడ్లు త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి.పార్లమెంటులో కొత్త క్రిమినల్ చట్టాలను ఆమోదించినందున క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన అవసరం ఉందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. దీని కోసం సిద్ధంగా ఉండాలని పోలీసు సూచించారు. దేశంలోని పోలీసు ఉన్నతాధికారులతో ఢిల్లీలో రెండు రోజుల పాటు జరిగిన నేషనల్ సెక్యూరిటీ స్ట్రాటజీ కాన్ఫరెన్స్ ముగింపు సమావేశంలో అమిత్ షా శనివారం మాట్లాడారు. మూడు క్రిమినల్ కోడ్లు క్రిమినల్ జస్టిస్ వ్యవస్థను పునరుద్ధరిస్తాయని, వ్యవస్థ భవిష్యత్తు డిమాండ్లను తీర్చడానికి సాంకేతిక ఆధారిత(ఏఐ) పోలీసింగ్ ను ప్రవేశపెట్టడానికి కొత్త చొరవలను సూచిస్తాయని మంత్రి చెప్పారు. దేశవ్యాప్తంగా 750 మందికి పైగా పోలీసు అధికారులు భౌతికంగా.. వర్చువల్ పద్ధతుల్లో ఈ సదస్సులో పాల్గొన్నారు.

పౌరులకు సకాలంలో న్యాయం అందించాల్సిన అవసరాన్ని, వారి రాజ్యాంగపరమైన హక్కులకు హామీ ఇచ్చే వ్యవస్థను నిర్ధారించాల్సిన అవసరం ఉందన్నారు. దేశ అంతర్గత భద్రతా సమస్యలను ఎదుర్కోవడంలో పోలీసులు తమ విధానంలో కొన్ని మార్చుకోవాలని కేంద్రమంత్రి సూచించారు.

పోలీసింగ్ లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడాన్ని నొక్కిచెప్పిన అమిత్ షా.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)లో సాంకేతిక పురోగతిని ప్రస్తావించారు. ఏఐ ను ఒక అవకాశంగా ఆయన అభివర్ణించారు. కృత్రిమ మేధను తమకు అనుకూలంగా ఉపయోగించుకోవడం నేర్చుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. రాబోయే 25 ఏళ్లలో ఇతర దేశాలకు చెందిన వారు భారత్ నుంచి నేర్చుకునేలా ఇండియన్ పోలీసు వ్యవస్థ ఆదర్శంగా ఉండాలని పోలీసులకు సూచించారు.

# ఆ రెండు చోట్ల ఒక్కటి మాత్రమే!

**జయభేరి, హైదరాబాద్ :**



రాష్ట్రంలో ఎన్నికల వేడి మొదలైంది. నోటిఫికేషన్ రాకముందే అభ్యర్థుల జాబితాపై ప్రధాన పార్టీలు దృష్టిపెట్టాయి. ఇక అధికార బీఆర్ఎస్ ఏకంగా 115 మంది అభ్యర్థులను ప్రకటించి... ప్రధాన ప్రతిపక్ష పార్టీలకు గట్టి సవాల్ విసిరింది. రేపోమాపో మిగతా 4 సీట్లను ప్రకటించేందుకు సిద్ధమవుతోంది. మరోవైపు ఈ ఎన్నికలను అతిపెద్ద సవాల్ గా తీసుకున్న తెలంగాణ కాంగ్రెస్... రేసు గుర్రాలపై ఫోకస్ పెట్టింది. ఆశావాహుల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. 119 నియోజకవర్గాల నుంచి వెయ్యి మందికిపైగా అప్లికేషన్స్ పెట్టుకున్నారు. ఇప్పటికే ఆయా దరఖాస్తులను పరిశీలించే పనిలో ఉంది కాంగ్రెస్ నాయకత్వం. అయితే భారీగా దరఖాస్తులు రావటంతో... అంతిమంగా టికెట్ ఎవరికి రాబోతుందనేది ఉత్కంఠగా మారింది.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం భారీగా దరఖాస్తులు చేసుకున్నారు నేతలు. అన్ని జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. వెయికి పైగా అప్లికేషన్స్ రావటంతో... టికెట్లకు భారీగా డిమాండ్ ఏర్పడినట్లు అయింది. ఇందులో చూస్తే కొందరు సీనియర్ నేతలు దరఖాస్తులు చేసుకోకుండా... తమ వారసులతో చేయించారు. పలువురు ముఖ్య నేతలు ఇతర నియోజకవర్గాల నుంచి టికెట్లు ఆశిస్తున్న పరిస్థితి ఉంది. ఇదిలా ఉంటే కొందరు నేతలకు హ్యాండించేలా కనిపిస్తోంది. ఫలితంగా పార్టీ తరపున టికెట్ ఎవరికి దక్కుతుందనేది సర్వత్రా ఉత్కంఠగా మారింది. 50 70కి పైగా నియోజకవర్గాల్లో పెద్దగా ఇబ్బందులు లేనప్పటికీ... మిగతా స్థానాల్లో తీవ్రమైన పోటీ ఉంది. కొన్ని జిల్లాల్లోని నియోజకవర్గాల్లో చూస్తే... ఒక్క టికెట్ కోసం ముగ్గురు నుంచి నలుగురు నేతలు పోటీ పడుతున్నారు. రిజర్వుడు నియోజకవర్గాలకు భారీగా పోటీ నెలకొంది. ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని ఇల్లందులో చూస్తే...36 అప్లికేషన్స్ రావటం ఆసక్తికరంగా మారింది. పరిశీలన ప్రక్రియను త్వరితగతిన ముగించి... వచ్చేనెల రెండో వారంలో అభ్యర్థులను ప్రకటించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఎక్కువగా పోటీ ఉండే నియోజకవర్గాల అభ్యర్థులను చివరి వరకు ఆపే అవకాశాలు ఉన్నట్లు గాంధీ భవన్ వర్గాలు చెబుతున్నాయి.




# మహిళా మిస్సింగ్

**జయభేరి, మేడిపల్లి :**

మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిది లో ఒక మహిళ తప్పిపోయిన కేసు పోలీస్ లు నమోదు చేసినారు. 26.08.2023 నాడు 12.00 గంటలకు అనిల్ పస్తవాన్ (43) S/o శంకర్ పాస్వాన్, డ్రైవింగ్, ఫ్లాట్ నెం. 285, దేవేందర్ నగర్ కాలనీ, బోడుప్పల్ తన భార్య కనపడటం లేదు అని పిటిషన్ ఇచ్చినాడు. తప్పిపోయిన మహిళా వివరాలు శ్రీమతి పి. సునీత దేవి (౩౭). 21.08.2023 రాత్రి వేళల్లో తన భార్య తో గొడవ పడ్డానని, ఆమె తీవ్రంగా గాయపడ్డాడు అని అనిల్ పేర్కొన్నాడు. మరుసటి రోజు అంటే, 22.08.2023 08.00 గంటల సమయంలో అతను దుకాణానికి పాల ప్యాకెట్ తీసుకురావడానికి బయటికి వెళ్లి ఇంటికి తిరిగి వచ్చినప్పుడు అతని భార్య కనిపించలేదు. ఇంటిని అతను అన్ని ప్రదేశాలలో వెతికాడు కానీ ఫలించలేదు, ఆమె తన మొబైల్ ఫోన్‌ను ఇంట్లోనే ఉంచింది. మహిళా మిస్సింగ్ కేసు ఫైల్ చేసినట్టు మేడిపల్లి పోలీస్ లు తెలిపినారు.

# సామాజిక దార్శనికుడు మహాత్మా జ్యోతిరావు పూలే..

**సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి, వారి విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త, మానవతావాది పూలే. సామాజిక ఉద్యమాల మార్గదర్శి మహాత్మా జ్యోతిరావు పూలే...**



చదువు లేనిదే జ్ఞానం లేదు, జ్ఞానం లేనిదే పురోగతి లేదు అనే సత్యాన్ని గ్రహించి 19వ శతాబ్దపు తొలినాళ్లలో నిమ్న జాతుల కోసం, మహిళల కోసం దేశంలో మొదటిసారిగా పాఠశాలలను ఏర్పరిచిన మహనీయుడు జ్యోతి రావు పూలే. విద్యావ్యాప్తి ద్వారా కుల వివక్షతను, సాంఘిక దురాచారాలను, మూఢనమ్మకాలను నిర్మూలించేందుకు కృషి చేశారు. కులం పేరుతో తరతరాలుగా అన్ని రకాలుగా అణచివేతలకు వివక్షతలకు గురయిన బడుగు, బలహీన వర్గాలలో ఆత్మస్థైర్యం కల్పించి, వారి హక్కుల కోసం పోరాడి, సాధికారత కోసం కృషి చేసిన మహనీయుడు జ్యోతిరావు పూలే. శతాబ్దాలుగా అణిచివేయబడ్డ కింది కులాల గురించి ఆలోచించిన మొదటి నాయకుడు జ్యోతిరావు పూలే. సాంఘిక సమానత్వం, సామాజిక న్యాయం అంటూ ఆలోచించి ప్రబోధించి దళిత వర్గాలను, బలహీన వర్గాలను జాగృతం చేసిన క్రియాశీలి ఆయన. మానవ హక్కుల కోసం పోరాటం నడిపిన విప్లవకారుడు జ్యోతిరావు పూలే. భారతీయులంతా ఒకటే వారంతా సమానమే అనే భావనకు ఆద్యుడు ఆయన. విద్య అనేది మానవుడికి జ్ఞానద్వారాన్ని తెరుస్తుందని గ్రహించి నిమ్నవర్గాలకు సమాజంలో అట్టడుగున పడి ఉన్న వర్గాలకు జ్ఞానజ్యోతి చూపాడు. శతాబ్దాలుగా తమకంటూ ఒక ప్రతిష్టాత్మకమైన పరిధిని ఏర్పాటు చేసుకొని సమాజంపై పెత్తనం చెలాయిస్తున్న ఆధిపత్య వర్గాలతో ఆయన ఒంటరిగా నిజాయితీగా పోరాడాడు. విద్యకు విజ్ఞానానికి గుత్త అధికారులుగా ఉన్న బ్రాహ్మణ వర్గం ఆయనకు అడ్డుగా నిలిచింది. నిమ్న వర్గాల హక్కులను, బ్రాహ్మణ వర్గాల నుంచి తీసుకోవడానికి ఆయన ఎంతగానో పోరాడవలసి వచ్చింది. జ్యోతిరావు పూలే సామాజిక విప్లవోద్యమ పిత. సమాజంలో నిమ్న జాతులు, స్త్రీలు, కార్మికులు, కర్షకులు ఎలా దోపిడీకి గురవుతున్నారో ఎలా అణిచివేయబడుతున్నారో చూసి వారిని ప్రబోధించి వారికి ప్రతిఘటన మార్గం చూపాడు. భారత రాజ్యాంగ రచయిత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పై జ్యోతిరావు పూలే సిద్ధాంతాల ప్రభావం చాలానే ఉంది. జ్యోతిరావు పూలేను డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తన గురువుగా ప్రకటించుకున్నారు. క్రింది కులాల వారు విద్యావంతులు కావాలి అన్న ప్రబోధాన్ని ఆచరణలో పెట్టినందువల్లనే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు జ్యోతిరావ్ అంటే ఎనలేని గౌరవం. అందుచేతనే ఆయన రచించిన "శూద్రులు ఎవరు?" అనే గ్రంథం జ్యోతిరావుకు అంకితం చేశాడు. మహాత్మా జ్యోతిరావు పూలే 1848లోనే అంటరానితనం వద్దని చెప్పాడు. నిమ్న జాతుల వారిని బావి నుంచి నీరు తోడుకోనిచ్చారు. సమాజం వెలివేసిన వారి పిల్లలకు చదువు నేర్పారు. అనాధ శిశువులను ఆదరించాడు. స్త్రీలకు విద్య నేర్పాడు. వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించాడు. బాల్యవివాహాలు, వితంతువులకు జుట్టు తీయించడం వంటి మూఢాచారాలను ఖండించాడు. పురోహితవ్యవస్థను వర్ణవ్యవస్థను ప్రతిఘటించాడు. పురోహితులు లేకుండానే మత సంబంధమైన విధులు ఎవరికివారు నిర్వర్తించు కోవచ్చని చెప్పారు. భారతీయులు మొట్టమొదటిగా మహాత్మా బిరుదునిచ్చి సత్కరించింది ఈయననే. భారతదేశంలోని కుల వ్యవస్థను సామాజిక అణచివేతను దోపిడీని వ్యతిరేకిస్తూ సేద్యగాని చర్నాకోల, గులాంగిరి వంటి రచనలు చేయడంతో పాటు సత్యశోధక సమాజ్ ద్వారా ఆచరణను కూడా ప్రారంభించారు మహాత్మ జ్యోతిరావు పూలే.

మహాత్మ జ్యోతిరావు పూలే 1827 ఏప్రిల్ 11న మహారాష్ట్రలోని సతారా జిల్లాలో గోవిందరావు పూలే, చిమ్నాబాయి దంపతులకు జన్మించారు. వెలుగును సూచిస్తూ జ్యోతి అనే పేరు పెట్టారు. శుద్రులకు, అతి శుద్రులకు విద్యను నిరాకరించిన ఈ దేశంలో ఈయన విద్యను అభ్యసించడానికి అనేక అడ్డంకులను దాటవల్సి వచ్చింది. ప్రాథమిక విద్యను పూర్తి చేసిన అనంతరం పూలే తండ్రికి వ్యవసాయ పనులకు సాయంగా ఉండేందుకు గోవిందరావు తన కుమారుడిని చదువు మాన్పించాడు. పూలే పగలు పూట తన తండ్రికి వ్యవసాయ పనుల్లో సాయం చేస్తూనే రాత్రి పూట చదువుకునేవారు. చదువు పట్ల పూలేకు ఉన్న ఆసక్తి గమనించిన, ముస్లిం టీచర్ మరియు క్రైస్తవ పెద్ద ఇద్దరు గోవిందరావును ఒప్పించి మళ్లీ బడిలో చేర్పించి జ్యోతి రావు పూలే



విద్యాభ్యాసం పూర్తి చేసేందుకు కృషి చేశారు. అప్పటి ఆచారం ప్రకారం పూలేకు 13 ఏళ్ల వయసులోనే 8 ఏళ్ల వయస్సు గల సావిత్రితో పెళ్లయింది. పూలే 1841లో పుణేలోని స్కాటిష్ మిషన్ స్కూల్లో చేరి సెకండరీ విద్యను పూర్తి చేశారు. 1848లో జరిగిన తన బ్రాహ్మణ మిత్రుని వివాహంలో పూలే బీసీ 'మాలీ' కులానికి చెందిన వాడవడం వల్ల కులవివక్షకు గురయ్యాడు. బ్రాహ్మణ మిత్రుని పెళ్లి ఊరేగింపులో జరిగిన ఈ అవమానం పూలే జీవితంలో గొప్ప మార్పుకు కారణం అయినది. అప్పటి నుంచి కులవివక్షపై పోరాడాలని నిర్ణయించుకున్నాడు. కులవిధానంలో బ్రాహ్మణులను విమర్శించడమే కాకుండా సమాజంలో బ్రాహ్మణ ఆధిపత్యాన్ని వ్యతిరేకించాడు. జ్ఞానసంపదకు అందరికీ అవకాశం ఇవ్వకపోవడానికి ఆయన తీవ్ర అభ్యంతరం తెలిపారు. థామస్ పెయిన్ 1791 లో రాసిన "రైట్స్ ఆఫ్ మెన్" అనే గ్రంథం పూలే చదవడం ద్వారా మానవ హక్కుల గురించి తెలుసుకున్నాడు. భారతదేశంలోని శూద్రులు అతిశూద్రులు (ఎస్సీ,ఎస్టీ,బీసీలు) బ్రాహ్మణీయ కుల వ్యవస్థలో అమెరికాలోని నల్లజాతి బానిసలాగే ఉన్నారని భావించాడు. కుల, మత, వర్గ, వర్ణంతో సంబంధం లేకుండా మానవులందరూ దేవుని దృష్టిలో సమానమేనని, అందరికీ సమాన హక్కులు ఉండాలని అన్నారు. పూలే కులవ్యవస్థ లోని అమానుషత్వాన్ని అంటరానితనాన్ని నిరసించాడు. సమాజంలో ఆధిపత్య కులాల ఆధిపత్యానికి మూల కారణం ఏమిటి అని ఆలోచించి దేశం ప్రగతిపథంలో నడవాలంటే అందరికీ విద్య అవసరమని భావించారు. త్వరితగతిన సమాజంలో మార్పు రావాలంటే విద్య ద్వారా సాధ్యమని తలచి తన భార్య సావిత్రిబాయి పూలేను చదివించి బాలికల పాఠశాలను మొదటిగా ఏర్పాటుచేయడం ద్వారా అందరికీ విద్య అందించాడు. సావిత్రిబాయి పూలే భారతదేశపు మొట్టమొదటి ఉపాధ్యాయిని కావడం గమనించదగ్గ విషయం. రైతాంగ ఉద్యమాలను నడిపారు. మిల్లు కార్మికుల కోసం పోరాడారు. బ్రాహ్మణ ఆధిపత్య వ్యతిరేక ఉద్యమాలను నడిపించారు. శూద్ర వర్ణంలోని రైతాంగంపై బ్రాహ్మణ వైశ్యుల (బాట్జీ, షేట్జీ) వడ్డీ దోపిడీ, శ్రమదోపిడిల రూపాలని, వారి బండారాన్ని బయటపెట్టారు. మహాత్మా జ్యోతిరావు పూలే గొప్ప సాంఘిక విప్లవకారుడు, హిందూ సమాజంలో శతాబ్దాలుగా నిస్సహాయులుగా పడి ఉన్న వారి కోసం జీవితాంతం శ్రమించిన త్యాగశీలి. తన రచనలు తృతీయ రత్న, పౌరోహిత్యం యొక్క బండారం, జిత్తులమారి బ్రాహ్మణత్వం, గులాంగిరి, సత్య శోధక సమాజ్ ద్వారా బ్రాహ్మణ భావజాలం పై తిరుగుబాటు జరిపి వైదిక భావజాలానికి ప్రత్యామ్నాయ సంస్కృతి ఏర్పడటానికి కృషి చేశారు. ధర్మశాస్త్రాల ప్రామాణికతను వేద పురాణాల వాస్తవికతను ప్రశ్నించిన హేతువాది. కవి, పద కర్త, గ్రంథకర్త త్యాగశీలి అయిన పూలే పక్షవాతం జబ్బున పడి 1890 నవంబర్ 28న అమరులయ్యారు. ఆధునిక భరతీయ సమాజాన్ని సంస్కరించడానికి ఎందరో సంస్కర్తలు భారతదేశంలో పుట్టినా కానీ కుల నిర్మూలన కోసం, సమాజ పునర్నిర్మాణం కోసం మొట్టమొదట దారులు వేసిన ఆధునిక యుగ పురుషుడు మహాత్మా జ్యోతి రావు పూలే. హైందవ సమాజంలోని అట్టడుగు జనావళి అభ్యున్నతే ఏకైక ధ్యేయంగా పనిచేశారు. నిరాడంబర జీవితాన్ని గడుపుతూ, సామాన్య జీవితంతో అసాధారణ కృషి చేసారు పూలే. అహంకారం, ఆధిపత్యం, అజ్ఞానం, అంధకారం అంటే గిట్టని జ్యోతి రావు పూలే అందరి ఆనందాన్ని కోరుకున్న ఆశావాది. మన అందరి ఆశాజ్యోతి.

**వ్యాసకర్త: ఆలేటి రమేష్**
**ప్రజా సంబంధాల అధికారి (PRO)**
**99487 98982**




# బిఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య కార్డులు

**జయభేరి, ఉప్పల్ :**

ఉప్పల్ శాసనసభ బారాస అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆరోగ్య సేవా కార్యక్రమాలు చేపట్టారు. అందులో భాగంగా రామంతపూర్ లోని 9వ వార్డు నెహ్రూ నగర్ లో మహిళా శక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు స్వరూప రాణి ప్రారంభించారు. స్వరూప రాణి గారు మాట్లాడుతూ... ప్రతి సంవత్సరానికి కుటుంబం మొత్తానికి ఐదు లక్షల వరకు ఉచిత వైద్యం. 1800 జబ్బులకు పైగా ఐదు లక్షల వరకు కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్యం. ప్రతి కుటుంబానికి ప్రతి కుటుంబ సభ్యులకి వేరువేరు కార్డులు ఇవ్వడం జరుగుతుంది. తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరు ఈ పథకానికి అర్హులు ఆరోగ్య మిత్రులు ఇంటింటికి తిరిగి ఈ ప్రక్రియను కొనసాగిస్తున్నారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరు బండారి లక్ష్మన్న సేవలను వినియోగించుకోవాలని, అలాగే ఇదే కార్యక్రమంలో కొత్త ఓటరు నమోదు ఉచితంగా చేయబడునని 18 సంవత్సరాలు నిండినటువంటి ప్రతి ఒక్కరూ ఓటరు నమోదు చేసుకోవాలని స్వరూప రాణి తెలిపారు. కావున ప్రజలందరూ ఈ యొక్క అవకాశాన్ని వినియోగించుకోవాలని అలాగే బండారి లక్ష్మన్న ని దేవుడు చల్లగా చూడాలని ఆయురారోగ్యాలతో అష్ట ఐశ్వర్యాలతో నిండు నూరేళ్లు సుఖశాంతులతో జీవించాలని స్వరూప రాణి, కార్యకర్తలు, ప్రజలు దేవుడిని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మంజుల గౌడ్, రేణుక, నరేష్, రాజు యాదవ్, నయీమ్, శ్యామ్, టిల్లు, శైలేందర్ యాదవ్ బిఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నిజాం పాలనలో నిజాం సైనికులు

**"రజాకార్లు" చేసిన అరాచకాలకు అంతే లేదు. ఎదురు తిరిగిన వారిని కిరాతకంగా నరికి, కాల్చిచంపి, మహిళలను మానభంగాలు చేసిన ఘటనలెన్నో. రజాకార్ల అరాచకాలను వారు చెప్తుంటే.. ఎవరికైనా కన్నీళ్ళు వస్తాయి... నిజాం పాలనలో అరాచకాలకు గురికాని గ్రామంలేదు.. 1948 ఆగస్టు 27న బైరాన్‌పల్లిలో నరమేధం జరిగింది. రాక్షసులు పంజా విసిరారు. పారిపోవడానికి ప్రయత్నించిన ప్రజలందరిపై విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. మహిళలను నగ్నంగా చేసి.. బతుకమ్మ ఆడించిన, అత్యాచారాలు చేసిన రజాకార్ల పైశాచిక ఆనందం నేటికీ వారి మనసుల్లో మానని పుండుగానే మిగిలి పోయింది.. సాయుధ పోరాటాలలో మొత్తం118 మంది వీరమరణం పొందారు. భారత చరిత్రలో మరో జలియన్‌వాలా భాగ్ ఇది. ఊరి పొలిమేరలో అమరవీరుల స్థూపం నిర్మించారు. గ్రామం నడిబొడ్డున పెద్ద బురుజు. ఏనాటికీ బైరాన్‌పల్లి పోరాట చరిత్ర మరువరానిది.. అనేకసార్లు నిజాం సైన్యాన్ని, రజాకార్లమూకలను తరిమికొట్టిన గ్రామం. వీరోచిత పోరాటాలకు కేంద్రం.. కానీ.. చరిత్ర పుటల్లో స్థానం దొరకని రక్తాక్షరమే బైరాన్‌పల్లి గ్రామస్థుల వీరపోరాటం..**
**ఆనాటి అమరవీరులకు పాదాభివందనాలు..**



**జయభేరి...**

1947, 48లో నిరంకుశ నిజాం పాలనకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలో ఈ గ్రామం పేరు ప్రఖ్యాతులు సంపాదించింది. నిరంకుశ నిజాం పోలీసులు, నిజాంతొత్తులైన దాష్టీక రజాకార్లు గ్రామస్థులను విపరీతంగా భాధించేవారు. రజాకార్ల అకృత్యాలకు అంతు ఉండేది కాదు.గ్రామస్థులు రక్షణ కోసం బురుజును నిర్మించుకుంటే రాజాకార్లు దానిని కూలగొట్టుటకు సిద్ధమయ్యారు. పలుమార్లు గ్రామస్థులు రాజాకార్లకు ఎదుర్కొనగా 1948 ఆగస్టు 27న 1200 మంది సైనికులు, రజాకార్లు ఆయుధాలతో వచ్చి గ్రామస్థులను పట్టుకొని సుమారు 118 మందిని వరసలో నిలబెట్టి కాల్చిచంపారు. ఇది భైరాన్‌పల్లి సంఘటనగా ప్రసిద్ధిచెందినది. తర్వాత ఆ ప్రాంతంలో అమరవీరుల స్తూపం నిర్మించారు. అమృత్‌సర్‌లోని జలియన్‌వాలా బాగ్ వలె ఇది కూడా దేశం కోసం స్ఫూర్తి పొందాల్సిన ప్రాంతమని 2008లో అప్పటి జిల్లా కలెక్టరు బి.జనార్ధన్ రెడ్డి హయంలో కోటి రూపాయలతో అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వానికి నివేదిక పంపారు. 1948 ఆగస్టు 27న బైరాన్‌పల్లిలో నరమేధం జరిగింది.సాయుధ పోరులో 118 మంది వీరమరణం పొందారు. భారత చరిత్రలోనే మాయని మచ్చగా నిలిచినా... భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమైంది.అది 1948 ఆగస్టు 27ఆ రోజు బైరాన్‌పల్లిలో ఉన్మాదం తాండవించింది. గ్రామ స్వరాజ్యం కోసం 92 మంది ఒకే రోజు నిజాం సేనల చేతుల్లో బలయ్యారు. బైరాన్‌పల్లి పోరాటం కేవలం నిజాం వ్యతిరేక పోరాటమే కాదు.చరిత్రలోకి తొంగిచూస్తే అది బ్రిటిష్ వ్యతిరేక పోరాటం. సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమం.. నిజాం సేనలను తొలుత ఊరి పొలిమేరల్లోకి తరిమికొట్టిన సాహసం వారిది. గ్రామాలపై దాడులు చేసి ఊళ్లకు ఊళ్లే తగలబెట్టి వల్లకాడుగా మార్చారు రజాకార్లు. నిజాం రజాకార్ల అకృత్యాలకు ఎంతోమంది తమ మాన ప్రాణాలను కోల్పోయారు. వీరుల్ని నిరాయుధుల్ని చేసి ప్రాణాలు తీసిన పిరికిపందల చరిత్ర ఒక వైపు ఉంటే.. మరోవైపు త్యాగాల చరిత్ర.. వ్యక్తి స్వార్థం లేని ఒక సమూహ లక్ష్యం కలిగిన మహోన్నత చరిత్ర భైరాన్‌పల్లి పూర్వపు వరంగల్ జిల్లాలోని (ప్రస్తుతం సిద్ది పేట జిల్లా) భైరాన్‌పల్లి నేడు వీర భైరాన్‌పల్లిగా మారింది.

ఏనాటికీ భైరాన్‌పల్లి పోరాట చరిత్ర మరువనిది. అనేకసార్లు నిజాం మూకలను తరిమికొట్టిన గ్రామం. వీరోచిత పోరాట కేంద్రం. నిజాం మూకల తూటాలకు, సైన్యం వికృత క్రీడకు బలిపశువయినా శౌర్యాన్ని చూపింది. తిరుగుబాటుకు నెలవుగా మారింది. పోరాటకాలంలో భైరాన్‌పల్లి ప్రజలు ప్రక్క గ్రామాల ప్రజలకు అండగా నిలిచారు. రజాకార్లకు ఎదురొడ్డి త్యాగాలు చేశారు. ఓ వైపు యావత్ భారతదేశం స్వాతంత్ర్య సంబురాల్లో మునిగితేలుతూ ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీల్చుతుండగా మరో వైపు నిజాం రాజుల ఏలుబడిలో ఉన్న పల్లెలన్నీ రజాకారు మూకల ఆగడాలు, దుశ్చర్యలతో వణికిపోతున్నాయి. రజాకార్లను ఎదురించి పోరాడలేక పల్లె ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని కాలం వెల్లదీస్తున్నారు. రజాకార్ల దురాగతాలను భరించలేక వారిపై తొలిసారిగా తిరుగుబాటు ప్రకటించి జంగ్‌సైరన్ చేసిన గ్రామమే వీరభైరాన్‌పల్లి. ఈ గ్రామానికి ఉన్న చారిత్రక నేపథ్యం మరే గ్రామానికి లేదనడంలో సందేహం లేదు.భైరాన్‌పల్లి గ్రామంలో అడుగుపెట్టేందుకు నిజాం సైన్యాలు వణికిపోతాయి. పిల్లల నుంచి పడుచు యువతుల దాకా..అంతా ఒక్కటై హైదరాబాద్ సంస్థానాన్ని సవాల్ చేస్తున్న కాలమది. నిజాం చీకటిపాలన నుంచి బయటపడి భారత యూనియన్‌లో ప్రజాస్వామిక స్వేచ్ఛాగాలులు పీల్చాలని ప్రతి గుండె, ప్రతి గ్రామం తహతహలాడుతున్న సందర్భమది. వరంగల్ జిల్లా భైరాన్‌పల్లి (నాటి నల్లగొండ జిల్లా) ఈ ఆకాంక్షలకు నిలువెత్తు ఆకృతిగా నిలిచింది.

**గ్రామరక్షణ దళం ఏర్పాటు...**

భైరాన్‌పల్లిలో ఇమ్మడి రాజిరెడ్డి, దుబ్బూరి రామిరెడ్డి, మోటం రామయ్యలాంటి యువకులు గ్రామరక్షణ దళాన్ని ఏర్పాటు చేసి ప్రభుత్వానికి పన్నులు కట్టడం మానేశారు. దొరలపై ధిక్కార స్వరం వినిపించి గ్రామమంతా ఒకేతాటిపై నిలిచేలా చేశారు. తమ పొరుగు గ్రామమైన లింగాపూర్‌పై దాడిచేసి ధాన్యాన్ని ఎత్తుకెళుతున్న క్రమంలో... భైరాన్‌పల్లి గ్రామరక్షక దళం నాయకులు, గ్రామస్తులంతా ఏకమై గొడ్డళ్లు, బరిసెలు, ఒడిసెలతో ఎదురుదాడికి దిగారు. దీంతో కక్షగట్టిన రజాకార్లు భైరాన్‌పల్లిని విధ్వంసం చేయాలనే నిర్ణయానికొచ్చారు.

**1948 మే నెలలో భైరాన్‌పల్లిపై దాడికి విఫలయత్నం. సవరించు**


1948 మే నెలలో 60 మంది రజాకార్లు తుపాకులతో భైరాన్‌పల్లిపై దాడికి ప్రయత్నించి విఫలమయ్యారు. రెండోసారి 150 మంది రజాకార్లు పోరుగ్రామంపై దాడికి పాల్పడి ఓటమి చెందారు. ఇలా రెండుసార్లు ఘోరంగా విఫలమైన రజాకార్లు భైరాన్‌పల్లిపై ప్రతీకారం పెంచుకున్నారు. 1948 ఆగస్టు 27న రాక్షసులు పంజా విసిరారు. పారిపోవడానికి ప్రయత్నించిన ప్రజలందరిపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. అవి రజాకార్లు గ్రామాలపై పడి ధన, మాన, ప్రాణాలను దోచుకుంటూ రాక్షస క్రీడలను కొనసాగిస్తున్న రోజులు. వారిని ఎదిరించి పోరాడేందుకు యువకులంతా కలిసి గ్రామ రక్షక దళంగా ఏర్పడ్డారు. దూళ్మిట్ట, కూటిగల్, లింగాపూర్, భైరాన్‌పల్లిలోని గ్రామ రక్షక దళాలు భైరాన్‌పల్లిని ముఖ్య కేంద్రంగా చేసుకొని రజాకార్ల ఆగడాలను తిప్పికొట్టసాగారు. దీనికి ప్రతిగా రజాకార్లు గ్రామాలపై మూకుమ్మడి దాడులు చేస్తూ ఇళ్లను తగులబెట్టి దోపిడీకి పాల్పడే వాళ్లు. గ్రామాలపై దాడులు చేసి దోచుకున్న సంపదతో తిరిగి రజాకార్లపై భైరాన్‌పల్లి వద్ద దూబూరి రాంరెడ్డి, ముకుందాడ్డి, మురళీధర్‌రావు నాయకత్వంలో గ్రామ రక్షణ, గెరిల్లా దళాలు దాడిచేసి దోపిడీ సంపదను స్వాధీనం చేసుకొని పంచిపెట్టాయి.

**భైరాన్‌పల్లి మారణకాండ...**

1948 ఆగస్టు చివరి వారంలో అర్ధరాత్రి, ఆ ఊరికి కాళరాత్రి అయింది. నిరంకుశత్వం.. దానవరూపమెత్తి ఊరి మహిళలను చెరబట్టింది. దాదాపు వందమందిని నిలబెట్టి నిలువునా కాల్చిచంపింది. ఒకే రోజు 92 మంది గ్రామస్తులను రజాకార్లు పొట్టన పెట్టుకున్నారు. నాటి మారణకాండకు గ్రామం నడిబొడ్డులో ఉన్న బురుజు సాక్షీభూతంగా ప్రస్తుతం దర్శనమిస్తోంది. రజాకార్లను ఎదురించేందుకు భైరాన్‌పల్లి గ్రామంలోని యువకులంతా కలిసి గ్రామ రక్షక దళంగా ఏర్పడ్డారు. ఒక రోజు రజాకార్లు గ్రామానికి సమీపంలో ఉన్న ధూల్మిట్ట, లింగాపూర్ గ్రామాలను రజాకార్లు దోచుకొని, దోచుకున్న సొత్తుతో భైరాన్‌పల్లి మీదుగా తిరుగు ప్రయాణమయ్యారు. దీనిని గమనించిన గ్రామరక్షక దళాలు రజాకార్లకు అడ్డు తిరిగి వారి వద్ద నుండి సొమ్మును స్వాధీనం చేసుకొని హెచ్చరికలు జారిచేస్తూ రజాకార్లను వదిలి వేసారు. దీంతో గ్రామంపై కక్ష పెట్టుకున్న రజాకారు మూకలు గ్రామంపై ఐదు సార్లు దాడి చేసి

## బురుజు నిర్మాణం

ఈ ఘటన తర్వాత భైరాన్‌పల్లిపై రజాకార్లు ఏ క్షణానైనా దాడికి పాల్పడే అవకాశముందనే అనుమానంతో గ్రామం నడిబొడ్డున ఎత్తైన బురుజు నిర్మించారు. బురుజుపైన మందుగుండు సామక్షిగిని నిల్వ చేసుకున్నారు. అనుమానితులు కనిపిస్తే బురుజుపై కాపాలా ఉండే ఇద్దరు వ్యక్తులు నగారా (బెజ్జాయి) మోగించడంతో ఆ శబ్దానికి సమీప గ్రామాలైన వల్లంపట్ల, కూటిగల్, బెక్కల్, కొండాపూర్, లింగాపూర్, దూళ్మిట్ట గ్రామాల ప్రజలు పరిగెత్తుకొంటూ వచ్చేవారు. రెండుసార్లు భైరాన్‌పల్లిపై దాడికి ప్రయత్నించిన రజాకార్లను గ్రామరక్షక దళాలు తిప్పికొట్టడంతో 40 మంది రజాకార్లు ప్రాణాలు కోల్పోయారు. దీంతో కక్షగట్టిన రజాకార్లు ఏరియా కమాండర్ ఆషీం ఆధ్వర్యంలో హైదరాబాద్ నుంచి రప్పించిన 500 మంది నిజాం సైనికులతో 1948 ఆగస్టు 27 తెల్లవారుఝామున భైరాన్‌పల్లిపై మూకుమ్మడి దాడి చేసి ప్రతీ ఇంట్లోకి ప్రవేశించి యువకులను బంధించి ఊరిబయటకు తీసుకువచ్చి లెంకలుగట్టి 96 మందిని కాల్చి చంపారు.



విఫలమయ్యారు. ఈ దాడులలో 20 మందికి పైగా రజాకార్లు మృతి చెందారు. దీంతో అప్పటి భువనగిరి డిప్యూటీ కలెక్టర్ హసీం భైరాన్‌పల్లి గ్రామాన్ని తిరుగుబాటు గ్రామంగా ప్రకటించి, గ్రామాన్ని నేల కూలుస్తానని సవాలు చేశాడు. రజాకార్లు ఏదో ఒక రోజు గ్రామంపై దాడి చేసే అవకాశం ఉందని భావించి గ్రామస్తులు గ్రామం చుట్టూ కోట గోడ నిర్మించుకొని మధ్యలో ఎత్తైన బురుజును నిర్మించుకొని దానిని రక్షణ కేంద్రాంగా మలుచుకున్నారు. అనుమానితులు ఎవరైనా కనిపిస్తే బురుజుపైన ఉన్న గ్రామ రక్షక దళ సభ్యులు నగారాను మోగించేవారు.

**ఏరులై పారిన రక్తం...**

1947 ఆగస్ట్ 15వ తేదీన దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా.. నిజాం రాష్ట్రంలో స్వేచ్ఛా వాయువులు వీయలేదు. మద్దూరు మండలం భైరాన్ పల్లి గ్రామం సహా చాలా గ్రామాల్లో రజాకార్ల పాశవిక దాడులకు అంతులేకుండా పోయింది. అయితే. భైరాన్‌పల్లి.. గట్టిగా నిలబడింది. ఊళ్లోని బురుజును స్థావరం చేసుకొని గ్రామంలోకి వచ్చిన రజాకార్లను ప్రతిఘటించి తరిమికొట్టేది. గ్రామరక్షణ దళాలను ఏర్పాటుచేసుకొని రాత్రింబవళ్లూ కాపలా కాసేవారు. భైరాన్ పల్లి గ్రామంపై పట్టుకోసం రజాకార్లు ఐదుసార్లు దాడులకు పాల్పడ్డారు. ఈ దాడుల్లో సుమారు 24 మం దికిపైగా రజాకార్లు ప్రజల చేతుల్లో మరణించారు.దీంతో భైరాన్‌పల్లిపై నిజాం మూకలు కక్ష పెంచుకున్నాయి. చివరకు దొంగదాడికి పాల్పడ్డాయి.

1948 ఆగస్టు చివరి వారంలో రజాకార్లు, పోలీసులు.. నిజాం సైన్యం సాయంతో 12 వందల మంది దాడికి దిగారు. జనగామలో రాత్రి 12గంటలకు పది బస్సులలో బయలుదేరారు. లద్దునూరు మీదుగా భైరాన్‌పల్లి చేరుకున్నారు. గ్రామం చుట్టూ డేరాలు వేశారు. ఉదయం నాలుగు గంటలకు బహిర్భూమికి వెళ్లిన వడ్ల నర్సయ్యను అదుపులోకి తీసుకున్నారు. ఆయనను వెంటబెట్టుకొని గ్రామంలోకి వస్తుండగా, వారిని నెట్టివేసి నర్సయ్య ఊళ్లోకి పరుగుపెట్టాడు. రజాకార్లు గ్రామంలోకి చొరబడ్డారంటూ ప్రజలను అప్రమత్తం చేశాడు. నగారా మోగించాడు. దాంతో ఊళ్లో జనమంతా గ్రామ బురుజుపైకి వెళ్లి తలదాచుకున్నారు. వారికి రక్షణగా గ్రామరక్షక దళాలు నిలిచా యి. బురుజుపై నుంచి రజాకార్లపైకి కాల్పులు జరిపాయి. 1948 ఆగస్టు 27న వేకువజామున గ్రామంలో తుపాకీ మోతలు వినిపించాయి. ఊరంతా ఒక్కసారిగా ఉలిక్కి పడింది. నిజాం సైన్యాధ్యక్షుడు ఖాసీం నాయకత్వంలోని రజాకారు సైన్యం గ్రామంలో తమకు జరిగిన పరాభావానికి ప్రతీకారం తీర్చుకునేందుకు 12వందల మంది బలగంతో భారీ మందు గుండు సామగ్రి, తుపాకులతో దొంగచాటున గ్రామపొలిమేర్లకు చేరుకున్నారు. గ్రామ పొలిమేర్లలో కాపలాగా ఉండి రజాకార్ల కదలికలను గ్రామ రక్షక దళాలకు అందించే విశ్వనాథ్‌భట్ జోషిని రజాకార్లు పట్టుకొని బంధించారు. తెల్లవారుజామున బహిర్భూమికి వచ్చిన ఉల్లెంగల వెంకటనర్సయ్యను రజాకార్లు పట్టుకోగా వారి నుండి తప్పించుకొని గ్రామాన్ని చేరుకొని రజాకార్లు గ్రామంలో చొరబడ్డారు అని కేకలు వేశాడు. గ్రామానికి రక్షణ కేంద్రంగా ఉన్న బురుజుపైనున్న దళ కమాండర్ రాజిరెడ్డి ప్రజలంతా రక్షణలోకి వెళ్లేందుకు నగారా మోగించాడు. బురుజుపై కాపలాగా ఉన్న మోటం రామయ్య, మోటం పోచయ్య, బలిజ భూమయ్య నిద్ర మత్తు వదిలించుకునే లోపుగానే రజాకార్ల తుపాకీ గుండ్లకు బలయ్యారు. ఫిరంగుల నుంచి వచ్చి పడ్డ నిప్పు రవ్వలతో బురుజుపై నిల్వ చేసిన మందుగుండు సామగ్రి పూర్తిగా కాలిపోయింది. దీంతో గ్రామంలోకి ప్రవేశించిన రజాకార్లు దొరికినోళ్లను దొరికినట్లుగా మట్టుపెట్టారు. అంతటితో ఆగకుండా రజాకార్లు ఇంటింటికీ తిరిగి 92మందిని పట్టుకొని పెడరెక్కలు విరిచి జోడుగా లెంకలు కట్టి వరుసగా నిలబెట్టి కాల్చి చంపి వారి రక్తదాహాన్ని తీర్చుకున్నారు. గ్రామం వెలుపల శవాల చుట్టూ మహిళలను వివస్త్రలుగా చేసి బతుకమ్మలను ఆడించారు. ఈ దాడులలో ఈ దాడులలో 118మంది అమాయకులు బలికాగా 25మంది రజాకార్లు చనిపోయినట్లు రికార్డులలో ఉంది. భైరాన్‌పల్లితో పాటు కూటిగల్ గ్రామంలో రజాకార్లు దాడులు చేసి 30మందిని పొట్టన పెట్టుకున్నారు. భైరాన్‌పల్లి పోరాట స్ఫూర్తితో హైదరాబాద్ సంస్థానంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఉధృతంగా సాగింది. భారత సర్కార్ నిజాం ప్రభుత్వంపై సైనిక చర్యకు దిగేందుకు సిద్ధం కాగా నిజాం ప్రభువు దిగివచ్చి అఖండ భారతదేశంలో హైదరాబాద్ సంస్థానాన్ని విలీనం చేయడం జరిగింది.



**- ఆలేటి రమేశ్**
ప్రజా సంబంధాల అధికారి, 99487 98982



## నేచురల్స్ బ్యూటీ పార్లర్ ప్రారంభోత్సవం

**జయభేరి, కాప్రా :**

చర్లపల్లి డివిజన్ చక్రీపురం చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన నేచురల్స్ బ్యూటీ పార్లర్ ప్రారంభోత్సవ వేడుకలలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేసిన ఉప్పల్ నియోజకవర్గ BRS పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ ,కప్రా కార్పొరేటర్ స్వర్ణ రాజ్ గారు, సినీ హీరో శ్రీ కృష్ణ,BRS నాయకుడు నే మూరి మహేష్ గౌడ్, నేచురల్స్ యాజమాన్యం రమేశ్, మహేష్ డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సైనిక్ పూరి లోని బిఎల్ఆర్ కార్యాలయంలో ఉప్పల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన చిలుకనగర్ బిఆర్ఎస్ పార్టీ ప్రెసిడెంట్ పల్లె నర్సింగ్ రావు, గుడి మధుసూదన్ రెడ్డి, పిట్టల నరేశ్ ముదిరాజ్, వీరెల్లి రవీందర్ రెడ్డి, కొంపల్లి రాజ్ కుమార్, రవీందర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.
**- జయభేరి, ఉప్పల్**



## ఓనం పండుగ ఉత్సవాలకు హాజరైన బిఎల్ఆర్

**జయభేరి, కాప్రా :**

చర్లపల్లి డివిజన్ సిరి గార్డెన్ లో జరిగిన ఓనం పండుగ సందర్భంగా కేరళ మంత్రి రాధ కృష్ణ తో కలిసి పాల్గొన్న ఉప్పల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఓనం భారతదేశంలోని కేరళ రాష్ట్రంలో జరిగే వార్షిక సాంస్కృతిక పండుగ. కేరళీయులకు ఒక ప్రధాన వార్షిక కార్యక్రమం. ఇది ఆ రాష్ట్ర అధికారిక పండుగ అని అందరికీ ఓనం పండుగ శుభాకాంక్షలు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రా రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ మల్లేశ్ యాదవ్, బిఆర్ఎస్ నాయకులు మహేష్ గౌడ్, బొడిగే రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




## ఒక్కసారి అవకాశం ఇవ్వండి ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధి ఏంటో చూపిస్తా

### ఉప్పల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, కాప్రా :**

ఒక్కసారి అవకాశం ఇవ్వండి... ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధి ఏంటో చూపిస్తా అని ఉప్పల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మీర్ పేట్ HB కాలనీ డివిజన్ కార్పొరేటర్ జెర్రీ పోతుల ప్రభుదాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో దాదాపు 500 మంది కార్యకర్తలు పాల్గొనగా బండారి లక్ష్మారెడ్డి కార్యకర్తలకు ఉద్దేశించి ప్రసంగించారు. మీకు అందరికీ అందుబాటులో వుంటా అని అందరినీ కలుపుకొని వెళ్తా అని ఏలాంటి గ్రూప్ రాజకీయాలకు తావు లేకుండా బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల అందరూ నా కుటుంబ సభ్యులే అని అన్నారు. ఎన్నికల్లో తమ బిడ్డగా నన్ను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు గుమ్మడి జంపాల్ రెడ్డి, డివిజన్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## ఆ రోజే డైరీలో రాసుకున్నా!



ఇటీవల ప్రకటించిన 69వ జాతీయ చలన చిత్ర అవార్డుల్లో 'మిమీ' చిత్రానికిగాను ఉత్తమ నటిగా పురస్కారాన్ని గెలుచుకుంది కృతిసనన్. 'గంగూబాయి కఠియావాడి' చిత్రంలో నటించిన అలియాభట్‌తో కలిసి కృతిసనన్ ఈ పురస్కారాన్ని పంచుకుంది. జాతీయ అవార్డుతో తన చిరకాల స్వప్నం నెరవేరిందని కృతిసనన్ ఆనందాన్ని వ్యక్తం చేసింది. ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా ఇండస్ట్రీలోకి వచ్చిన తనలాంటి వారు అవార్డు గెలుచుకోవడం ఔత్సాహికులకు స్ఫూర్తినిస్తుందని కృతిసనన్ పేర్కొంది. ఆమె మాట్లాడుతూ 'అవార్డు వచ్చిందని తెలియగానే పట్టరాని సంతోషం కలిగింది. మా కుటుంబ సభ్యులందరితో కలిసి డ్యాన్సులు చేస్తూ రోజంతా ఉత్సాహంగా గడిపాను. జాతీయ అవార్డు గురించి ఎప్పటి నుంచో కలలు కంటున్నా. ఎప్పటికైనా జాతీయ పురస్కారం సాధించాలని 2020లోనే నా డైరీలో రాసుకున్నా. అది ఇప్పుడు నిజమైంది. అవార్డు వచ్చినంత మాత్రాన నేనేదో సాధించానని అనుకోవడం లేదు. ఇండస్ట్రీలో నేర్చుకోవాల్సింది ఇంకా చాలా ఉంది' అని చెప్పింది. ప్రస్తుతం ఈ భామ హిందీలో పలు భారీ ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉంది.



## అందుకు పారితోషికం ఎంతో తెలుసా?


టాలీవుడ్ బుట్టబొమ్మగా పేరు తెచ్చుకుంది బ్యూటిఫుల్ పూజా హెగ్డే. మాస్క్ అనే తమిళ సినిమాతో సినీ రంగుల ప్రపంచంలోకి అడుగు పెట్టిన ఈ సుందరాంగి మొదట మోడలింగ్ బాటలో పయనించింది. మోడలింగ్ రంగంలో తనదైన అందచందాలతో ఆకట్టుకుని పలు అవార్డ్స్ సొంతం చేసుకుంది. ఈ క్రమంలోనే దర్శకనిర్మాతల దృష్టిని ఆకర్షించింది ముద్దుగుమ్మ పూజా హెగ్డే. అలా సినీ అవకాశాలను అందిపుచ్చుకుంది పూజా హెగ్డే. పూజా హెగ్డే తెలుగులో డబ్ అయిన తమిళ చిత్రం మాస్క్ లో హీరోయిన్‌గా నటించింది. తర్వాత తెలుగులోకి అక్కినేని నాగ చైతన్య హీరోగా చేసిన ఒక లైలా కోసం సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. దీని తర్వాత వెంటనే మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్‌తో ముకుంద మూవీలో జత కట్టింది. మొదటి రెండు సినిమాల్లో పద్ధతిగా కనిపించిన ఈ బ్యూటిఫుల్ అల్లు అర్జున్ డీజే మూవీతో గ్లామర్ ఒలకబోయడం ప్రారంభించింది. అనంతరం పెద్ద హీరోలతో నటించడం, అవి కాస్తా హిట్ కావడంతో స్టార్ హీరోయిన్ రేంజ్‌కు ఎదిగింది పూజా హెగ్డే. అయితే ఇటీవల పూజా హెగ్డే నటించిన సినిమాలు వరుసగా ఫ్లాప్ కావడంతో ఆమె సినీ కెరీర్ ప్రశ్నార్థకంగా మారింది. ఆచార్య, బీస్ట్, కిసీ కి భాయ్ కిసి కీ జాన్, సర్కస్ మూవీస్ వరుసగా బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయి. ఈ ఎఫెక్ట్‌తోనే మహేశ్ బాబు గుంటూరు కారం సినిమాలో మెయిన్ హీరోయిన్ అవకాశం పోగొట్టుకుందని టాక్ వినిపిస్తోంది. అయితే పూజా హెగ్డే సినిమాలు ఫ్లాప్‌గా నిలిచిన ఆమె డిమాండ్ ఏమాత్రం తగ్గలేదని తాజాగా ఓ సంఘటన తెలియజేస్తుంది. ప్రస్తుతం సినీ అవకాశాలు లేని పూజా హెగ్డే షాపింగ్ మాల్స్ ప్రారంభోత్సవాలతో బిజీగా ఉంది. తాజాగా కడపలోని ఓ షాపింగ్ మాల్‌ను పూజా ప్రారంభించింది. ఆమెను చూసేందుకు అభిమానులు భారీగా పోటెత్తారు. తర్వాత పూజా నటించిన సినిమా పాటలకు స్టెప్పులు వేసింది. ఇక ఈ షాపింగ్ మాల్ ఓపెనింగ్‌కు పూజా హెగ్డే రూ. 40 లక్షల పారితోషికం తీసుకుందని టాక్. కొన్నిగంటలు మాత్రమే గడిపిన పూజా హెగ్డే అంత మొత్తం డిమాండ్ చేసిందని అంటున్నారు. ఇదే కాకుండా ఏ షాపింగ్ మాల్‌కు అయినా పూజా వచ్చి రిబ్బన్ కట్ చేయాలంటే అక్షరాలా 40 లక్షలు డిమాండ్ చేస్తోందట.



## రీ రిలీజ్‌కు సిద్ధమైన క్లాసిక్ లవ్ స్టోరీ నువ్వే కావాలి

ప్రస్తుతం టాలీవుడ్‌ను రీ రిలీజ్ ట్రెండ్ ఊపేస్తుంది. స్ట్రైయిట్ సినిమాలకు రీ రిలీజ్ మూవీస్ గట్టిపోటీనిస్తోన్నాయి. తాజాగా రీ రిలీజ్ సినిమాలో జాబితాలో తరుణ్ క్లాసిక్ లవ్ స్టోరీ నువ్వే కావాలి చేరనుంది. ఈ సినిమాను త్వరలో రీ రిలీజ్ చేయబోతున్నట్లు నిర్మాణ సంస్థ స్రవంతి మూవీస్ ప్రకటించింది. సెప్టెంబర్ ఫస్ట్ వీక్‌లో ఈ మూవీ థియేటర్లలో రీ రిలీజ్ కాబోతున్నట్లు సమాచారం.

విజయ్ భాస్కర్ డైరెక్షన్‌లో 2000 సంవత్సరంలో రిలీజైన ఈ మూవీ టాలీవుడ్‌లో ట్రెండ్ సెట్టర్‌గా నిలిచింది. కోటి బడ్జెట్‌తో రూపొందిన ఈ సినిమా అప్పట్లోనే 20 కోట్లకుపైగా కలెక్షన్స్ రాబట్టి సెన్సేషనల్ రికార్డ్ క్రియేట్ చేసింది. 20 సెంటర్స్‌లో 200 రోజులకుపైగా ఆడిన ఈ మూవీ నేషనల్ అవార్డ్‌తో పాటు అనేక అవార్డులు, రివార్డులను సొంతం చేసుకున్నది. స్నేహం, ప్రేమ అంశాల నేపథ్యంలో తెరకెక్కిన ఈ మూవీలో తరుణ్, రిచా యాక్టింగ్, త్రివిక్రమ్ డైలాగ్స్‌తో పాటు కోటి స్వరపరచిన పాటలు అభిమానులను అలరించాయి. ఈ సినిమాతో తరుణ్ స్టార్‌డమ్‌ను సొంతం చేసుకున్నాడు. తెలుగులో యూత్‌ఫుల్ లవ్ స్టోరీస్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయాడు. మలయాళ సినిమా నీరమ్ ఆధారంగా నువ్వే కావాలి రూపొందింది. అయితే మలయాళం కంటే తెలుగులోనే ఈ సినిమా పెద్ద విజయాన్ని సాధించడం గమనార్హం.



## సోలోగా బాక్సాఫీస్ బరిలో నిలిచిన ఖుషి

ఈ వారం బాక్సాఫీస్ బరిలో విజయ్ దేవరకొండ సోలోగా దిగబోతున్నాడు. ఖుషి సినిమాతో ప్రేక్షకుల్ని పలకరించబోతున్నాడు. విజయ్ దేవరకొండ, సమంత జంటగా నటించిన ఖుషి మూవీ సెప్టెంబర్ 1న పాన్ ఇండియన్ లెవెల్‌లో రిలీజ్ కానుంది. రొమాంటిక్ లవ్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ మూవీకి శివ నిర్వాణ దర్శకత్వం వహించాడు. పాటలు, ట్రైలర్స్‌తో ఖుషిపై అంచనాలు భారీగా ఏర్పడ్డాయి. గీత గోవిందం, టాక్సీవాలా తర్వాత సరైన కమర్షియల్ హిట్ కోసం ఎదురుచూస్తోన్న విజయ్ దేవరకొండకు ఖుషి సక్సెస్ కీలకంగా మారింది. అతడి ఎదురుచూపులకు తగ్గ ఫలితం ఈ సినిమాతో లభిస్తుందా? లేదా? అన్నది మరో నాలుగు రోజుల్లో తేలనుంది. ఖుషి మూవీని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించింది. ఖుషితో పాటు సెప్టెంబర్ 1న నానీ ప్రేమకథ తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అలాగే తమిళ కమెడియన్ సంతానం హీరోగా నటించిన కిక్ మూవీ సెప్టెంబర్ 1న తెలుగులో రిలీజ్ కాబోతోంది.

## వంద కోట్ల క్లబ్‌కు చేరువలో రజనీ మూవీ

జైలర్ మూవీ రిలీజై 18 రోజులు అవుతోన్న వసూళ్ల జోరు మాత్రం తగ్గడం లేదు. ఆదివారం నాటితో వరల్డ్ వైడ్‌గా ఈ సినిమా 600 కోట్లకుపైగా వసూళ్లను రాబట్టింది. తాజాగా తెలుగులో ఈ మూవీ అరుదైన రికార్డుకు నెలకొల్పడానికి అడుగు దూరంలో ఉంది. వంద కోట్ల మైలు రాయికి చేరువైంది. ఆదివారం నాటి తో ఈ మూవీ తెలుగులో 95 కోట్లకుపైగా వసూళ్లను రాబట్టినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఈ వారం రిలీజైన సినిమాలు కూడా బాక్సాఫీస్ వద్ద మిక్స్‌డ్ టాక్‌ను సొంతం చేసుకున్న నేపథ్యంలో ఈ వీక్ కూడా జైలర్ సినిమాకు ఎదురులేకుండా పోయింది. ఈ నేపథ్యంలో ఈ మూవీ మరో రెండు మూడు రోజుల్లో వంద కోట్ల క్లబ్‌లో చేరడం ఖాయమని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇప్పటివరకు తెలుగు డబ్బింగ్ సినిమాల్లో రజనీకాంత్ 2.ఓ తో పాటు యశ్ కేజీఎఫ్ 2 మాత్రమే వంద కోట్ల మైలురాయిని దాటాయి. ఈ ఘనతను సాధించిన మూడో సినిమాగా రజనీకాంత్ జైలర్ నిలవనుంది. అంతే కాకుండా ఈ రేర్ ఫీట్‌ను తెలుగులో రెండు సార్లు అందుకున్న ఏకైక హీరోగా రజనీకాంత్ నిలవబోతున్నాడు. తెలుగులో ఈ సినిమాను దిల్‌రాజు, ఏషియన్ సునీల్‌లతో కలిసి రానా దగ్గుబాటి రిలీజ్ చేశారు. కేవలం 12 కోట్ల బ్రేక్ ఈవెన్ టార్గెట్‌తో రిలీజైన ఈ మూవీ నిర్మాతలకు నాలుగింతల లాభాల్ని మిగిల్చింది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ మూవీకి నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహించాడు. మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్, జాకీ ష్రాఫ్ అతిథి పాత్రల్లో కనిపించారు. రమ్యకృష్ణ, మిర్నా మీనన్, సునీల్, తమన్నా కీలక పాత్రలు పోషించారు





## ట్రోల్స్‌పై అల్లు అర్జున్ రియాక్షన్ ఇదే!

పుష్ప సినిమాతో ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డును అందుకున్నాడు అల్లు అర్జున్. బెస్ట్ యాక్టర్ కేటగిరీలో నేషనల్ అవార్డ్ అందుకున్న తొలి తెలుగు నటుడిగా చరిత్రను సృష్టించాడు. అయితే బన్నీకి నేషనల్ అవార్డ్ ప్రకటించడంపై ప్రశంసలతో పాటు విమర్శలు వినిపిస్తోన్నాయి. పుష్ప సినిమాలో ఎర్ర చందనం అక్రమ రవాణా చేసే పుష్పరాజ్ అనే స్మగ్లర్ పాత్రలో బన్నీ నటించాడు. స్మగ్లర్ పాత్రకు నేషనల్ అవార్డు ఎలా ఇస్తారంటూ కొందరు సినీ, రాజకీయ వర్గాలతో పాటు నెటిజన్లు ట్రోల్ చేస్తున్నారు. ఈ ట్రోల్స్‌పై బన్నీ రియాక్ట్ అయ్యాడు. నేషనల్ అవార్డ్స్, ఆస్కార్ ఎక్కడైనా నటుడి పర్ఫార్మెన్స్‌ను మాత్రమే చూసి బెస్ట్ యాక్టర్ అవార్డులు ఇస్తారు. బ్యాట్‌మెన్ లాంటి నెగెటివ్ క్యారెక్టర్‌కు ఆస్కార్ అవార్డ్ వచ్చింది. జంజీర్, అగ్నిపథ్ సినిమాల్లో అమితాబ్‌బచ్చన్ నెగెటివ్ షేడ్స్‌తో కూడిన డాన్ క్యారెక్టర్‌లో నటించాడు. ఆ పాత్రల్లో ఆయన నటనకు నేషనల్ అవార్డులు వచ్చాయి. పుష్ప సినిమాలో నా నటననే పరిగణనలోకి తీసుకొని జాతీయ అవార్డు ఇచ్చారని అనుకుంటున్నా. అంతే కానీ కథానేపథ్యం, పాత్ర స్వభావం కాదని నా నమ్మకం అని అల్లు అర్జున్ అన్నాడు. నేషనల్ అవార్డ్స్‌లో బెస్ట్ యాక్టర్ కేటగిరీలో అల్లు అర్జున్‌తో పాటు రామ్‌చరణ్, ఎన్టీఆర్ కూడా పోటీలో ఉన్నట్లు ప్రచారం జరిగింది. ఈ పోటీ గురించి అల్లు అర్జున్ స్పందించాడు. బెస్ట్ యాక్టర్ కేటగిరీలో దక్షిణాదితో పాటు బాలీవుడ్ నుంచి 20కిపైగా నామినేషన్స్ వచ్చాయని అల్లు అర్జున్ పేర్కొన్నాడు. ఈ పోటీలో లోకల్ కంటే నేషనల్ కాంపిటీషన్ పై ఎక్కువగా దృష్టిపెట్టానని అల్లు అర్జున్ తెలిపాడు.



## 'కింగ్ ఆఫ్ కోత' స్ట్రీమింగ్ ఎందులో అంటే?

తెలుగులో అందమైన ప్రేమ కావ్యంగా బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన చిత్రం సీతారామం. ఈ మూవీతో మలయాళ హీరో దుల్కర్ సల్మాన్ ఇటీవల మరో సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు దుల్కర్ సల్మాన్. గ్యాంగ్‌స్టర్ దుల్కర్ సల్మాన్ నటించిన లేటెస్ట్ మూవీ కింగ్ ఆఫ్ కోత. ఈ సినిమాను తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో పాన్ ఇండియాగా ఆగస్ట్ 24న రిలీజ్ చేశారు. ప్రపంచవ్యాప్తంగా విడుదలైన దుల్కర్ సల్మాన్ కింగ్ ఆఫ్ కోత సినిమా మిశ్రమ స్పందన తెచ్చుకుంటోంది. ఈ నేపథ్యంలో కింగ్ ఆఫ్ కోత ఓటీటీ స్ట్రీమింగ్ హాట్ టాపిక్‌గా మారాయి. కింగ్ ఆఫ్ కోత సినిమా డిజిటల్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ డిస్నీ ప్లస్ హాట్‌స్టార్ చేజిక్కుంచుకుందని టాక్. అలాగే మూవీ థియేటర్ రిలీజుకు 40 రోజుల తర్వాత ఓటీటీలో స్ట్రీమింగ్ చేయనున్నారట.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Publishedat # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com